
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


నేడు కలెక్టరేట్‌లో ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులంతా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని ఆమె ఆదేశించారు. జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కమనీయం.. రాములోరి కల్యాణం



సంజీవనగర్ రామాలయంలో సీతారాముల కళ్యాణం

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- ఉదయం కల్యాణోత్సవం.. సాయంత్రం గ్రామోత్సవం
- మార్మోగిన రామ నామస్మరణ

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. భక్తి ప్రపత్తులతో జై శ్రీరాం నినాదాల నడుమ ఒక్కో ఘట్టం కమనీయంగా సాగింది. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన నవమి వేడుకలు కల్యాణోత్సవం, తలంబ్రాల తంతు వరకు వైభవంగా సాగాయి. జీలకర్ర బెల్లం ఘట్టం, మంగళసూత్రధారణ, తలంబ్రాలను చల్లుకునే వేడుకలను చూసి భక్తులు పులకించారు. కల్యాణోత్సవాన్ని ఆద్యంతం భక్తులు చూసి ఆనంద పరవశులయ్యారు. చలువ పందిళ్ల కింద కూర్చొని సీతమ్మతల్లి, రామచంద్రమూర్తుల కల్యాణ ఘట్టాన్ని ఆద్యంతం వీక్షించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా, పెళ్లి మంత్రోచ్చారణ పఠిస్తుండగా, కల్యాణ తంతును వీనుల విందుగా ఆలకిస్తూ తరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల అక్షితలను అర్చకులతో తలపై చల్లించుకొని, నైవేద్యంగా పెట్టిన వడపప్పు, పానకం, పండ్లను భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. హైందవ సంస్కృతికి నిలువెత్తు ఆరాధ్య దైవమైన శ్రీరామచంద్రుని జన్మదిన వేడుక 'శ్రీరామ నవమి'ని ఉమ్మడి జిల్లా వాసులు ఘనంగా నిర్వహించుకున్నారు. నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ కోదండరామాలయంలో భగవత్‌సేవాసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు.



ఆంజనేయ కోదండ రామస్వామి దేవాలయంలో ప్రత్యే అలంకారంలో సీతా రామలక్ష్మణులు



నంద్యాల సంజీవనగర్ రామాలయంలో భక్తులు



సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేక అలంకారంలో సీతారామలక్ష్మణులు



శ్రీశైలంలో..

మహానందిలో కోదండరాముడి కల్యాణం

మహానంది, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం మహానందిలోని కోదండరాముల స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. కోదండరామాలయంలోని పాలరాతి విగ్రహాలకు ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ప్రత్యేక నామార్చన పూజలు జరిపారు. అనంతరం సీతా సమేత కోదండరాముల స్వామి ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. వేదమంత్రాలు, మేళతాళాలతో కల్యాణ వేదిక వద్దకు ఉత్సవమూర్తుల విగ్రహాలను తీసుకొచ్చారు. అభిజిత్‌లగ్నంలో ముందుగా గణపతి పూజ, పుణ్యహవాచనం, పీఠార్చన, కంకణధారణ అనంతరం సీతాదేవి, కోదండరాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం సీతారాములు హనుమంతవాహనంపై క్షేత్రవీధుల్లో విహరించారు. ఈ వేడుకల్లో నంద్యాల జిల్లా న్యాయాధికారి పి.వాసు దంపతులు, ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, ప్రకాశంశర్మ, రాఘవశర్మ, శరభయ్యశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. దంపతులు హాజరయ్యారు.



మహానందిలో కోదండరామస్వామి గ్రామోత్సవం



బనగానపల్లె పట్టణంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కుటుంబ సభ్యులు

మల్లన్న క్షేత్రంలో సీతారాముల కల్యాణం

శ్రీశైలం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో ఆదివారం శ్రీనామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి లోక కల్యాణార్థం సంకల్పం పఠించారు. ఈ వేడుకలో ఆలయ ఈఓ ఎం. శ్రీనివాసరావు, ఏఈఓ ఎం.హరిదాసు, పర్యవేక్షకులు కె.అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలు జనం బెంబేలు

నంద్యాల జిల్లా కేంద్రంలో దొంగలు పడ్డారు. వరుస చోరీలతో హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాలనే లక్ష్యంగా చేసుకొని రెక్కీ నిర్వహించి మరీ చోరీలకు పాల్పడుతున్నారు. ఇంటి యజమానులు తాళాలు వేసి బయటకు వెళ్లిందే అదనుగా లోనికిచొరబడి సొమ్ము, సొత్తులను దోచుకుపోతున్నారు. ఈ క్రమంలో చోరీలను నియంత్రించాల్సిన పోలీసులు రికవరీలో మాత్రం వెనుకబడ్డారు. జిల్లా కేంద్రంలో అవాంఛనీయ ఘటనలు, అసాంఘికశక్తుల ఆగడాలు, ప్రమాదాలు, చోరీలు జరగకుండా గట్టి నిఘాను ఏర్పాటు చేశామని డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నామంటూ చెబుతున్న పోలీస్ అధికారుల ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. రాత్రిపూట గస్తీలో వైఫల్యం దొంగలకు కలసివస్తోంది. ఇటీవలి కాలంలో వరుస దొంగతనాలు పోలీసులకు పెనుసవాల్‌గా మారాయి.

-నంద్యాల క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి)



చెల్లాచెదురుగా వస్తువులు (ఫైల్)



సీసీ కెమెరాలో దొంగ కదలికలు(ఫైల్)

నిఘానేత్రం ఏమైంది?

రాత్రిపూట చోరీలు జరగకుండా, అసాంఘికశక్తుల ఆటకట్టించేందుకు నైట్ పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది విధులు ప్రశ్నార్థకంగా మారాయి. తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ప్రజలనుంచి వినిపిస్తున్నాయి. కేవలం రాత్రిపూట సైరన్‌కొడుతూ వెళ్లిపోవడమే తప్ప అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, వారిని విచారించడం, అదుపులోకి తీసుకొని స్టేషన్లకు తీసుకువెళ్లడంవంటివి జరగడంలేదని తెలుస్తోంది. నిఘా కెమెరాలతో, ప్రత్యేక సిబ్బందితో విధులు నిర్వర్తిస్తున్నామంటూ పోలీస్ ఉన్నతాధికారుల ప్రకటనలు ఆ మేరకు కార్యరూపం దాల్చడం లేదు. వరుస దొంగతనాల నేపథ్యంలో పోలీసుల వైఫల్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మచ్చుకు కొన్ని సంఘటనలు

- ఈ ఏడాది జనవరి నెలలో నంద్యాల పట్టణ శివారులోని రైతునగరంలో దారిదోపిడీ దొంగలు ముఖాలకు ముసుగు వేసుకుని హల్‌చల్ చేశారు. వాహనదారుడిని ఆపి కారుపై రాడ్లతో దాడిచేశారు. అనంతరం డ్రైవర్‌పై కత్తులు, కట్టెలతో దాడిచేసి గాయపరచి అతడివద్ద వున్న బంగారు గొలుసు, నగదు అపహరించుకుపోయారు.
- నంద్యాల నుంచి పాణ్యం వెళ్తున్న ఓ జంటపై దారిదోపిడీ దొంగలు హైవేలో అటకాయించి వారిని గాయపరచి వారివద్ద ఉన్న సొమ్ము, బంగారు సొత్తులను లాక్కొని పరారయ్యారు.
- మార్చి 7వ తేదీ నంద్యాల పట్టణ శివారులోని రైతునగరంలో టీడీపీ నాయకుడు ఇంట్లో చోరీ జరిగింది. ఇంటికి తాళాలువేసి పట్టణంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లిన సమయంలోనే దొంగలు ఆ నాయకుడి ఇంట్లో చొరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేసి తాళాలు పగులగొట్టి 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదును అపహరించారు. చోరీ ముగించుకొని తిరిగి యథావిధిగా విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించి దొంగలు పరారు కావడం గమనార్హం.
- మార్చి నెల 30వ తేది రాత్రి పట్టణ శివారులోని క్రాంతినగర్‌లో సుభాన్ అనే వ్యక్తి హైదరాబాద్‌కు వెళ్లడంతో రెక్కీ నిర్వహించిన దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.5.50 లక్షల నగదు, 6 తులాల బంగారు నగలు, అరకిలో వెండి కాజేశారు. చోరీ దృశ్యాలు ఇంటిముందున్న సీసీ కెమెరాలో నమోదయ్యాయి.
- మార్చి 31న నంద్యాల పట్టణ శివారులోని ఓ ప్రముఖ విల్లాలో దొంగలు వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. మరో రెండిళ్లలో చోరీకి యత్నించగా యజమానులు మేల్కొని పెద్దగా కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. నాలుగు ఇళ్లల్లో రూ.13లక్షల నగదు, 12తులాల బంగారు నగలు, అరకిలో వెండి అపహరించుకొని ఉడాయించారు.
- బడాచోరీలే కాకుండా జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ల పరిధిలలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా చిన్న చిన్న చోరీలకు పాల్పడుతున్నారు. ఇంటికి తాళాలువేసి పనిపై బయటకు వెళ్లివచ్చేసరికి దొంగలు తమ పని తాపీగా ముగించుకొని సొమ్ము, సొత్తుతో ఉడాయిస్తున్నారు.

హడలెత్తిపోతున్న ప్రజలు

గడచిన రెండేళ్ల కాలంలో 2023లో జరిగిన చోరీల సంఖ్య కన్నా 2024లో జరిగిన దొంగతనాల సంఖ్య అధికంగా ఉంది. వీటితోపాటు ఈ ఏడాది నుంచి వరుస చోరీలు కలవరపెడుతున్నాయి.

చోరీల వివరాలు	2023	2024	పెంపు శాతం
పగటిపూట చోరీలు	21	27	28
రాత్రి చోరీలు	77	107	39
పశువుల చోరీలు	6	11	83

- నంద్యాల పట్టణంలో దొంగతనాలు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- పోలీసులకు పెనుసవాల్‌గా ఘటనలు
- చోరీల సంఖ్య పెరుగుతున్నా చర్యలు శూన్యం



నిఘా పెంచాం

జిల్లా కేంద్రంలో జరుగుతున్న చోరీలను నియంత్రించేందుకు రాత్రిపూట గట్టి నిఘాను ఏర్పాటు చేశాం. ప్రజలు ఇళ్లనుంచి బయటకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలి. ఇంట్లో సీసీ కెమెరాలను అమర్చుకొని వాటి పర్యవేక్షణ మొబైల్ ఫోన్లను అనుసంధానం చేసుకోవాలి. అపరిచితులు మీ ప్రాంతంలో, ఇంటివద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు తెలపాలి. అపార్ట్‌మెంట్లు, విల్లాస్‌కు సంబంధించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతోపాటు గట్టి సెక్యూరిటీని నియమించుకోవాలి.

- మందా జావలి అల్ఫోన్స్, ఏఎస్పీ, నంద్యాల



బీరువాను తెరచి నగదు, సొత్తులను లూటీ చేసిన దొంగలు (ఫైల్)

తర్తూరు బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ దంపతులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన లక్ష్మీరంగనాథస్వామి తర్తూరు జాతర బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్వామివారు ఆదివారం భక్తులకు పెళ్లికుమారుడిగా భక్తులకు దర్శనమిచ్చాడు. ముందుగా తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ దంపతులు రెవెన్యూ కార్యాలయం నుంచి మేళతాళాలతో పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ అధికారి సాయికుమార్ దంపతులు తహసీల్దార్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగ తం పలికారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమ ర్పించి పెళ్లికుమారునిగా తయారుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కూరు తహసీల్దార్ రత్నరాధిక, కొత్తపల్లి తహ సీల్దార్ ఉమారాణి, ఆలయ చైర్మన్ నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లుయాదవ్, రమణా రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, దొరబా బురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న భ్రమరాంబకు కుంభోత్సవం



కుంభోత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఈవో

శ్రీశైలం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 15న భ్రమరాంబాదేవి అమ్మవారికి దేవస్థానం కుంభోత్సవం కార్యక్రమాన్ని జరపనుంది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు ఆదివారం కుంభోత్సవ ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి స్థానిక రెవెన్యూ, పోలీస్, దేవస్థానం యూనిట్ అధికారులు, సెక్షన్ అధికారులు, వైదిక సిబ్బందితో పాటు స్థానిక తహశీల్దార్ కె. వి. శ్రీనివాసరావు, స్థానిక సీఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కుంభోత్సవ వేడుక క్షేత్రరక్షణ కోసం నిర్వహించే ఉత్సవంగా పేరొందిన కారణంగా కైంకర్యాలన్నింటినీ పరిపూర్ణంగా జరిపించాలని వైదిక సిబ్బందికి సూచించారు. కుంభోత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయ మెట్లమార్గంలో అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కుంభోత్సవం రోజు సాయంత్రం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని క్యూలైన్లలో తొక్కిసలాట జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు. దేవదాయ చట్టం అనుసరించి క్షేత్రపరిధిలో జంతు, పక్షి బలులు, జీవహింస పూర్తిగా నిషేధించామని, క్షేత్రపరిధిలో జంతు బలులు నిర్వహించినా, సహకరించినా నేరంగా పరిగణిస్తామని తెలిపారు.



తలంబ్రాల వేడుక

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు




కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

ఆత్మకూరులో గాలివాన

- పెనుగాలుల ధాటికి విరిగిపడిన మామిడి వృక్షాలు
- క్వింటాళ్ల కొద్దీ రాలిపడిన మామిడి కాయలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



గాలివాన బీభత్సానికి విరిగిపడిన మామిడి వృక్షం

ఆత్మకూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో ఆదివారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పెనుగాలులు వీచడంతో ఆత్మకూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గల పలు గ్రామాల్లోని మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బలమైన గాలుల ధాటికి పలు చోట్ల మామిడి వృక్షాలు నేలకూలగా క్వింటాళ్ల కొద్ది మామిడి కాయలు నేలరాలి తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఏడాదంతా ఎంతో కష్టపడి కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటే చివరికి గాలివాన బీభత్సానికి మామిడి కాయలన్నీ రాలిపోవడంతో లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. వాస్తవానికి ఈ ఏడాది మామిడి దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొద్దోగొప్పో దిగుబడులు చేతికొచ్చే సమయానికి ప్రకృతి ప్రకోపానికి మామిడి కాయలు బలై దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు దెబ్బతిన్న మామిడి తోటలను సందర్శించి నష్టపరిహారాన్ని అంచనా వేసి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



పంటంతా రాలిపడిన మామిడి కాయలు

10క్వింటాళ్లకు పైగా మామిడి కాయలు నేలరాలాయి



ఆత్మకూరు మండలంలోని కురుకుంద గ్రామంలో మూడు ఎకరాల మామిడి తోటను కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాను. సుమారు రూ.4లక్షల వరకు పంట సస్యరక్షణ చర్యలకు ఖర్చు చేశాను. ప్రస్తుతం మధ్య సైజులో మామిడి కాయలు ఉన్నాయి. ఆదివారం పెనుగాలుల ధాటికి తోటలోని 16ఏళ్ల నాటి మామిడి వృక్షాలు నేలకొరిగాయి. 10క్వింటాళ్లకు పైగా మామిడి కాయలు నేలరాలాయి. రూ.3లక్షలకు పైగా నష్టం సంభవించింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- మోహబతుల్లా, మామిడి రైతు, ఆత్మకూరు

ఆత్మహత్యాయత్నం చేసిన రైతు కుటుంబం

ప్రాణాపాయస్థితిలో బాధితులు

పాములపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అప్పులపాలైన ఓ రైతు తన భార్యా పిల్లలకు, తల్లికి పురుగుల మందుతాపి, తాను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని ఇస్కాల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గొల్ల సోమేశ్వరుడు అనే రైతు గత కొన్ని ఏళ్ళుగా దాదాపు 20 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని పత్తి, మిరప, పొగాకు, మొక్కజొన్న పంటలను సాగుచేసి అప్పులపాలయ్యాడు. దీంతో గత మంగళవారం రాత్రి కుటుంబసభ్యులకు తెలియకుండా కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలిపి ఇచ్చి, తాను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ రోజు రాత్రి నుంచి సోమేశ్వరుడికి, కుటుంబసభ్యులందరికీ వాంతులు విరేచనాలు అవుతుండటంతో బంధువులు పాములపాడు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. ఆ తర్వాత ఆత్మకూరుకు, కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో డాక్టర్లు గద్దించి అడిగిన మీదట సోమేశ్వరుడు.. అసలు విషయం చెప్పాడు. బాధితులను తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్ కలిసి వివరాలను అడిగి తెలుసుకొన్నారు.

డీబీసీ డబ్ల్యూవోగా ప్రసూన నియామకం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారిగా కే. ప్రసూనను నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ సంక్షేమ శాఖలో ఇటీవల జరిగిన పదోన్నతుల్లో భాగంగా నెల్లూరు జిల్లాలో సహాయ బీసీ సంక్షేమ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రసూనకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారిగా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగ్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని కొటేకల్లు గ్రామ క్రాస్ రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎమ్మిగనూరు వైపు వస్తున్న మినీ లారీ టైర్లు పగిలిపోవడంతో ఎదురుగా వస్తున్న స్కార్‌పియో వాహనానికి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కార్‌పియో వాహనాన్ని నడుపుతున్న కోసిగి మండలం దుద్ది గ్రామానికి చెందిన ప్రహ్లాద(30) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మంగమ్మ అనే మహిళకు గాయాలు కావడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. రూరల్‌ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ఆస్పరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ములు గుదం గ్రామ సమీపంలో తెర్నకల్లుకు చెందిన మతిస్థిమితం లేని ఉప్పర ఉమాపతి (30)అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు సీఐ మస్తాన్వలి ఆదివారం తెలిపారు. మృతు డికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఇంటి పైకప్పు కూలి ఒకరి మృతి

నంద్యాల క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంజుమన్ వీధిలో ఓ ఇంటి పైకప్పు కూలి మీదపడటంతో ఒక వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. అంజుమన్ వీధిలో నివసిస్తున్న షేక్ రఫీఅహమ్మద్ (54) అనే వ్యక్తి రాత్రి తన మిత్రుడి ప్రథమచికిత్స కేంద్రం వద్ద మిత్రులతో మాట్లాడుతుండగా ప్రథమ చికిత్స కేంద్రం పైకప్పు మీద ఉన్న గోడ కూలి రఫీ అహమ్మద్‌పై పడింది. తలకు బల మైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మరణించినట్లు ధృవీకరించారని పోలీ సులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ముస్లింలను మభ్యపెట్టేందుకు వైసీపీ కుట్రలు

- మంత్రి టీజీ భరత్‌పై తప్పుడు ప్రచారం
- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వాహీద్ హుస్సేన్



సమావేశంలో ఐక్యత చాటుతున్న ముస్లిం నాయకులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ముస్లింలను మభ్యపెట్టేలా వైసీపీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వాహీద్ హుస్సేన్ పేర్కొన్నారు. కర్నూలులో ముస్లింలకు మంత్రి టీజీ భరత్ అండగా ఉంటున్నారని, ఆయనపై తప్పుడు ప్రచారాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మైనార్టీ విభాగం నాయకులు విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా మంత్రి టీజీ భరత్‌పై వైసీపీ నాయకుడు అహ్మద్ అలీఖాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ విషయంలో ముస్లింలకు మద్దతుగా నిలుస్తామని టీజీ భరత్ అప్పట్లోనే స్పష్టం చేశారని తెలిపారు. ఈ బిల్లు సవరణ వల్ల ముస్లింలకు ఎప్పటికీ అన్యాయం జరగదన్నారు. వైసీపీ నాయకులు వక్ఫ్ సవరణ బిల్లును రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారన్నారు. వక్ఫ్ బిల్లుపై వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. వాస్తవాలను ప్రజల ముందుకు పెడతామన్నారు. వైసీపీ ముస్లిం నాయకులు చేతనైతే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తెలుగుదేశం పార్టీ వక్ఫ్ సవరణ బిల్లుకు 3 సవరణలు సూచించిందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ బాషా, నాయకులు హమీద్, అబ్బాస్, మన్సూర్, అలీఖాన్, ఇబ్రహీం, రబ్బాని, రమీజ్, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో పడి వ్యక్తి మృతి

కౌతాళం, ఏఫ్రిల్ 6:(మండలంలోని బదినేహాల్ గ్రామం వద్ద ఎల్లెల్సీలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. కోసిగి గ్రామానికి చెందిన ముక్కరన్న(28) కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన శశికళను వివాహం చేసుకున్నాడు. బదినేహాల్‌లో సోమవారం జరిగే మల్లికార్జున స్వామి జాతరను తిలకించేందుకు కుటుంబంతో సహా వచ్చాడు. సాయంత్రం స్నేహితులతో కలిసి గ్రామ సమీపాన ఉన్న ఎల్లెల్సీలో ఈతకు వెళ్లి కొట్టుకుపోయాడు. స్నేహితులు గమనించి ముక్కరన్నను వెలికి తీసి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఫెయిల్ అవుతానన్న భయంతో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గైని విక్రమ్ కుమార్తె గైని వైష్ణవి(19) కర్నూల్ నగరంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. మూడు రోజుల క్రితం సెలవులపై ఇంటికి వచ్చిన వైష్ణవి ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేరని గమనించి విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మలమడుగు ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మార్గమధ్యంలో మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు.

ఫుట్‌పాత్ కార్మికులు ఈశ్రమ్‌లో నమోదు చేసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఫుట్‌పాత్ కార్మికులు ఈశ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కే.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్ల నమోదు కోసం ఈ నెల 7 నుంచి 17 వరకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.

ఉలిక్కిపడిన గోవిందపల్లె

- హత్యాయత్నం కేసులో నిందితుల కోసం గాలింపు ముమ్మరం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫ్యాక్షన్ జోన్ సీఐ
- పోలీసుల అదుపులో అనుమానితులు



గోవిందపల్లెలో వివరాలు తెలుసుకుంటున్న ఫ్యాక్షన్ జోన్ సీఐ

శిరివెళ్ల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం గోవిందపల్లెలో వైసీపీ నాయకుడు ఇందూరి ప్రతాప్‌రెడ్డిపై శనివారం జరిగిన హత్యాయత్నం ఘటనతో గ్రామం ఉలిక్కిపడింది. ఈ ఘటనలో పరారీలో ఉన్న ఇద్దరు ప్రధాన నిందితుల కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ పర్యవేక్షణలో పోలీసు బృందాలు పలుచోట్ల పర్యటిస్తూ నిందితుల ఆచూకీ కోసం వివరాలు సేకరిస్తున్నారు. ఘటన జరిగిన పరిస్థితులు, దాడికి గల కారణాలపై సమగ్రంగా విచారిస్తున్నారు. ఘటన వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందా? అన్న కోణంలో కూపీ లాగుతున్నారు. ఈ మేరకు నంద్యాల ఫ్యాక్షన్ జోన్ సీఐ పార్థసారథి గోవిందపల్లెలోని ఘటనాస్థలాన్ని ఆదివారం పరిశీలించారు. హత్యాయత్నం కేసు వివరాలు, గ్రామంలోని పరిస్థితులపై ఆయన ఆరా తీశారు. ఇదిలా ఉండగా గ్రామంలో పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బాధితుడు ఇందూరి ప్రతాప్‌రెడ్డిని మెరుగైన వైద్యం నిమిత్తం తరలించారు.

జంట హత్య కేసులోనూ నిందితుడు

గోవిందపల్లె గ్రామంలో 2017, మే నెలలో జంట హత్యలు జరిగాయి. ఇందులో గంగుల కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన మాజీ ఎంపీపీ ఇందూరి ప్రభాకర్‌రెడ్డి, అతని బావ మేరువ శ్రీనివాసరెడ్డి సాయంత్రం వాకింగ్‌కు వెళ్లిన సమయంలో దుండగులు దాడి చేసి వారిద్దరినీ దారుణంగా హత్య చేశాయి. ఈ ఘటనపై శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో 9 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నం చేసిన నిందితుడు గంగదాసరి రవిచంద్రారెడ్డి.. 2017లో జరిగిన జంట హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. ఈ హత్య కేసులో ప్రతాప్‌రెడ్డి ప్రధాన సాక్షిగా ఉండడం.. ఈ నెల 21 నుంచి కోర్టులో కేసు ట్రయిల్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నం జరగడంతో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు.

పోలీసుల అదుపులో కొందరు వ్యక్తులు

గోవిందపల్లె గ్రామంలో జరిగిన హత్యాహత్నం ఘటనలో ప్రత్యక్ష సాక్షి ఇందూరి వెంకట కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. గ్రామానికి చెందిన గంగదాసరి రవిచంద్రారెడ్డి, గంగదాసరి లక్ష్మీరెడ్డి, గంగదాసరి శ్రీనివాసరెడ్డి, శిరిగిరి రమణారెడ్డితోపాటు మరో గుర్తుతెలియని వ్యక్తిపై 324, 307 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులుగా చేర్చిన కొందరు వ్యక్తులతోపాటు అనుమానితులను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పరారీలో ఉన్న ఇద్దరు ప్రధాన నిందితుల కోసం పోలీసులు బృందాలుగా విడిపోయి ముమ్మరంగా గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

బైక్‌పై వస్తుండగా ఢీకొట్టిన దున్నపోతు ..



గుండ్ర నాగార్జున(ఫైల్)

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పెద్ద చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాడనుకున్న విద్యార్థి అర్థాంతరంగా రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డాడు. అత్యంత విషాదకరమైన ఈ సంఘటన కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండ్ర నాగన్న, లక్ష్మీదేవి దంపతుల పెద్ద కుమారుడు నాగార్జున(16) ఇటీవలే పదో తరగతి పరీక్షలయ్యాక గ్రామంలో ఉంటున్నాడు. ఆదివారం పండుగ రోజు ఇప్పుడే వస్తానంటూ గ్రామ సమీపంలోని తిమ్మనాయినిపేట మెట్ట వద్దకు మోటార్‌సైకిల్‌పై వెళ్లి తిరిగి గ్రామానికి చేరుకుంటున్న సమయంలో రోడ్డు పక్కనే పొలంలో నుండి పరుగెత్తుకుంటూ వచ్చిన దున్నపోతు బైకును ఢీకొట్టింది. దున్నపోతు కొమ్ము నాగార్జున తలకు తగిలి బలమైన గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. సాధారణ రైతు కుటుంబీకులైన నాగన్న, లక్ష్మీదేవి దంపతులకు ఇరువురు కుమారులు. మృతుడు నాగార్జున బనగానపల్లెలోని నెహ్రూ పాఠశాలలో చదువుకొని, ఇటీవలే పదవ తరగతి పరీక్షలు రాశాడు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడు...

నందవరం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామం దగ్గర గుర్తు తెలియని లారీ అతి వేగంగా వచ్చి గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మందలో ఉన్న గొర్రెల కాపరి కురవ లింగప్ప(20) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో గొల్ల నరసప్ప, బోయ నరసప్ప, శ్రీనివాసులకు తీవ్ర గాయాలయ్యాయి. 3 గొర్రెలు అక్కడిక్కడే చనిపోగా మరో 20 గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ కేశవ్ మాట్లాడుతూ.. ఎమ్మిగనూరులో ఆదివారం సంత కావడంతో మంత్రాలయం మీదగా ముగతి వైపు నుంచి ఎమ్మిగనూరు సంతకు దాదాపు 120 గొర్రెలను తీసుకుని గొర్రెల కాపరులు సంతకు బయలుదేరారని, ముగతి దగ్గర ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైవిధ్యభరితమైన విమర్శ 'చెమట చెక్కిన వాక్యం'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన సాహిత్య విమర్శలో అరుదైన విశ్లేషణాత్మకమైన శైలి కలిగిన పుస్తకం 'చెమట చెక్కిన వాక్యం' అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ కవి కెంగార మోహన్ రాసిన 'చెమట చెక్కిన వాక్యం' గ్రంథ పరిచయ సభ నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు ఈ సభకు అధ్యక్షత వహించగా, రచయిత్రి నాగమణి సభకు ఆహ్వానం పలికారు. ఈ గ్రంథాన్ని ప్రముఖ విద్యావేత్త, విశ్రాంత హెచ్ఎం విజయసారథి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆవిష్కర్త మాట్లాడుతూ కెంగార మోహన్ ఈ గ్రంథ ఆవిష్కరణకు తనను ఆహ్వానించడం తమ గురుశిష్య సంబంధానికి తార్కాణమని చెప్పారు. జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ ఒక విమర్శ గ్రంథం రాయడానికి వందలాది పుస్తకాలు అధ్యయనం చేయాల్సి వస్తుందని, ఇది విమర్శకుడి ప్రతిభ, ప్రజ్ఞకు నిదర్శనమని అన్నారు. విరసం రాష్ట్ర నాయకుడు పాణి మాట్లాడుతూ అరవై పుస్తకాలపై విమర్శ అన్నది సాధారణ విషయం కాదని చెప్పారు. పుస్తకంలో కవుల కవిత్వ రచన తీరు, వర్ణన, శైలి, శిల్పాలను వర్ణించడంలో కవి వైవిధ్యత ప్రదర్శించారని అభినందించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కవిగా, కథకుడిగా, విమర్శకుడిగా బహుముఖీన ప్రజ్ఞ కలిగిన కవి కెంగార మోహన్ అని అన్నారు. ప్రముఖ కథా రచయిత్రి డాక్టర్ ఎం. ప్రగతి ఇది మాట్లాడుతూ కవిత్వ అంతరంగాన్ని శోధించిన గ్రంథమని, ఈ గ్రంథం వర్తమాన కవులు చదివితే మంచి కవిత్వం రాస్తారని చెప్పారు. తెలుగు కళాస్రవంతి కార్యదర్శి ఇనాయతుల్లా మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలోని విమర్శపాత్రను ఈ గ్రంథం పూర్తి చేస్తుందని అన్నారు. ఈ సభలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప, గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజులతోపాటు పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

● వైభవంగా శ్రీరామనవమి వేడుకలు ● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


జూపాడుబంగ్లా: తంగడంచ గ్రామంలో..


పగిడ్యాల: నెహ్రూనగర్ గ్రామంలో..


ఆత్మకూరులో..


పాణ్యం: అలమూరులో..


నంద్యాల్లో వడపప్పు, పానకం పంపిణీ


బండిఆత్మకూరులో రాములోరి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. అనతరం భక్తులు అన్నదానం చేశారు. పానకం, పందేరం పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్ సమీపంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి, సింధు దంపతులు వడపప్పు, పానకం, ప్రసాదం పంపిణీ చేశారు.

నంద్యాల మున్సిపాలిటీ: టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ఆదివారం శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురష్కరించుకుని పదవ తరగతి మూల్యాంకనంలో ఉన్న ఉపాధ్యాయులకు డీఈవో జనార్దన్‌రెడ్డి వడపప్పు, పానకం పంపిణీ చేశారు. డీవైఈవోలు శంకరప్రసాద్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: నంద్యాల మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించారు. అర్చకులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

గోస్పాడు: మండలంలో శ్రీరామనవమిని వైభవంగా నిర్వహించారు. ఎస్ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాణ్యం: మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సీతారాములకు కల్యాణం, గ్రామోత్సవాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నెరవాడలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం ప్రజలు వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులకు ఉత్సవ నిర్వాహకులు అన్నదానాలు, అల్పాహార వితరణలు చేపట్టారు. పట్టణంలోని సిద్దేశ్వరస్వామి ఆలయం వద్ద గల శ్రీకోదండ రామాలయానికి చెందిన అతిప్రాచీన రథానికి ఆదివారం ప్రజలు విశేష పూజలు చేపట్టారు. రథానికి నువ్వుల నూనెతో అలకరించారు. ఆతర్వాత నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బండిఆత్మకూరు: మండలంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులు గ్రామోత్సవాల్లో పాల్గొని రంగులు చల్లుకున్నారు.

మహానంది: మండలంలో శ్రీరామనవమి సందర్భంగా సీతా రాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో శ్రీరామనవమి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు పానకం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలో శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించారు. కనకయ్యకొట్టాల గ్రామంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే జయసూర్య టీడీపీ నాయకులు మాండ్రశివానందరెడ్డి, గౌరువెంకటరెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలో శ్రీరామ నవమి పండుగను ఘనంగా నిర్వహించుకు న్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కొత్తపల్లి: మండలంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించి పూజలు చేశారు.

సున్నిపెంట: సున్నిపెంటలో సీతారాములు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు.


సున్నిపెంటలో..


వెలుగోడులో..


ఆత్మకూరు రూరల్: వెంకటాపురంలో..


పాములపాడు: కాంతినిలయం గ్రామంలో..


కొత్తపల్లి: ఎదురుపాడులో..


నంద్యాల రూరల్: అయ్యలూరు గ్రామంలో..


నందికొట్కూరులో..


గడివేముల: కె.బొల్లవరం గ్రామంలో..


నంద్యాలలో పాల్గొన్న ఫిరోజ్

'సొంతూరిని ఎప్పటికీ మరవకూడదు'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సొంతూరిని ఎప్పటికీ మరువకూడదని ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకరవ్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవరం సందర్భంగా తరిగోపుల గ్రామంలో ఆదివారం క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సును ప్రముఖ క్యాన్సర్ వైద్యులు రవీంద్రబాబు ఏర్పాటు చేశారు. సొంతూరిలోని తరిగోపుల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రూ.10లక్షలతో భోజనశాల నిర్మించి, క్యాన్సర్ నివారణ టీకాలు వేయించిన వైద్యుడు రవీంద్రబాబును అభినందించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసే పీ4 కార్యక్రమం ఉద్దేశ్యం కూడా ఇదే తరహాలో ఉందని వారు చెప్పారు. ఓస్థాయిలో సంపాదించుకున్నవారు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, నారాయణరెడ్డి, దొరబాబురెడ్డి, వెంకటరమణనాయుడు, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మన్నగౌడు, గోరేసాహెబ్, ఖాజీకురైషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాలను సందర్శించిన వైద్యాధికారులు

పాములపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కాల గ్రామాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ఆదివారం పరిశీలించారు. గ్రామంలోని సోమేశ్వరుడు కుటుంబం అస్వస్థతకు గురయ్యారన్న సమాచారం నేపథ్యంలో మండల వైద్యాధికారి నాగలక్ష్మితో కలసి గ్రామంలో బాధిత కుటుంబ సభ్యుల ఇంటి పరిసారలను పరిశీలించారు. పారిశుధ్యం, తాగునీరు, నీటి ట్యాంకుల శుద్ధి తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు సేకరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అస్వస్థతకు గురి కావడానికి ఫుడ్ పాయిజన్ కాదని, వారి వ్యక్తగత కారణాల వల్ల పురుగుల మందు తాగి వాంతులు విరేచనాలు అయినట్లు గ్రామస్థులు, బంధువులు తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. సర్పంచ్ మౌళాలి, పీఎస్ నాగశేషులు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

'ఇళ్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటాం'

నందికొట్కూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని వాల్మీకి నగర్‌లో ఆదివారం విద్యుత్ స్మార్ట్ మీటర్ల స్టిక్కర్లు విడుదల చేసి ఇళ్లకు అతికించారు. సీపీఎం నాయకులు గోపాల కృష్ణ, రాజు, ఫక్కీర్ సాహెబ్, ఉస్మాన్ బాషా, వెంకటేశ్వర్లు, బోయ పాండుకాలనీ వాసులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీలిషికారిపేటలో పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఆది వారం పోలీసులు నీలిషికారీ పేటలో నిర్వహించిన తనిఖీల్లో 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ. చంద్రశేఖర్ తెలిపారు.

మహానందిలో జాయింట్ డైరెక్టర్ పూజలు



జాయింట్ డైరెక్టర్‌కు మెమెంటో అందజేస్తున్న అర్చకుడు

మహానంది, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆది వారం సాయంత్రం న్యూ ఢిల్లీ మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ జాయింట్ డైరెక్టర్ హెచ్‌కే అమర్‌నాథ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రధాన గర్భాలయంలో స్వామి వారికి జలాభిషేకం, కామేశ్వరీ దేవి అమ్మవారికి కుంకుమార్చన పూజలను నిర్వహించారు. కల్యాణ మంటపంలో వీరిని ఆలయ అర్చకుడు బెక్కెం శరభయ్యశర్మ ఆశీర్వదించారు. స్వామి వారి మెమెంటోతో పాటు ప్రసాదాలను అందజేశారు.

కోర్టు కేసులపై సమావేశం

ఆత్మకూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని కోర్టు హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్‌లతో క్రైమ్ అండ్ క్రిమినల్ నెట్‌వర్క్ ట్రాకింగ్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్)పై ఆదివారం డీఎస్పీ రామాంజి నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా డివిజన్ పరిధిలోని ఆయా పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలని అన్నారు. తద్వారా కేసులకు సంబంధించి పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. తీవ్రమైన కేసులను త్వరితగతిన కన్విక్షన్ పడేలా చొరవ తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో వున్న అన్ని కోర్టు బెయిలబుల్, నాన్‌బెయిలబుల్ వారెంట్లను అమలు చేయాలని అన్నారు. కోర్టు సీడీలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలన్నారు. కోర్టు కానిస్టేబుల్, సీసీటీఎన్ఎస్, ఎస్‌హెచ్‌వోలు ముగ్గురు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

పాస్టర్ మృతిపై విచారణ జరపాలి'


నిరసన ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

సున్నిపెంట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై విచారణ జరపాలని సున్నిపెంటలోని క్రైస్తవ ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులకు రక్షణ కల్పించాని కోరారు. పాస్టర్లు రాజు, బెంజిమెన్, దానియాలు, తిమోతి, జోసఫ్, ఇజ్రాయిల్ తదితరులు పాలజ్గన్నారులో

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

నందికొట్కూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మే 26వ తేదీన నందికొట్కూరులో జరిగే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఐజయ్య, అశోకరత్నం పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని అఖిల భారత మాల సంఘాల జేఏసీ కార్యాలయంలో అఖిలభారత మాలల సంఘాల జేఏసీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు డా.రాజు, తమ్మెడపల్లె యేసేపు, తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు శిక్షణ


మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): హజ్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో ఆదివారం జిల్లాలోని హజ్ యాత్రికులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా కలిసిమెలజి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఇస్లామిక్ పండితులు, హజ్ సొసైటీ సభ్యులు, హజ్ యాత్రికులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్ గాయపడ్డారు. మంత్రి ఫరూక్ శివశంకర్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

బాధిత కుటుంబానికి చేయూత

మహానంది, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆంజనేయ పురం గ్రామంలో మౌళాలికి చెందిన గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి మహానంది మండల రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు వంట సామగ్రితో పాటు నిత్యావసరాలను ఆదివారం అందజేశారు. సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్, సభ్యులు స్వాములు, కమలాకర్ నాయుడు, మద్దిలేటి స్వామి, ఆంజనేయిలు, మదనశేఖర్ పాల్గొన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

ఆత్మకూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర స్థాయి ఆరు పండ్ల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ధారపనేని బాబుచౌదరి, ధారపనేని భాస్కరరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు. కాగా ఈ పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 8వ తేది మంగళవారం ఉదయం 8గంటల్లోగా రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పందెల్లో పాల్గొనే సభ్యులకు, ప్రేక్షకులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 6281655869, 8074622364 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కొత్తపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామ శివారులోని బ్రమరాంబ చెంచుగూడెంలో శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని విశ్రాంత అదనపు జాయింట్ కలెక్టర్ రామస్వామి విశ్రాంత జిల్లా టీబీ అధికారి మోక్షేశ్వరుడుతో కలిసి చెంచు మహిళలకు చీరలు, పురుషులకు టవళ్లు పంపిణీ చేశారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన రామాలయంలో చెంచు మహిళలతో మాట్లాడారు. గిరిజనులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలని, వారికి అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ట్రీట్‌మెంటు సూపర్‌వైజర్ మస్తానయ్య, సూపర్‌వైజర్ గుర్రప్ప, సీనియర్ సహాయకులు బాబుమియా, వీఆర్వోలు అశోక్, రామసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

జిల్లాలో గట్టి బందోబస్తు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని దేవాలయాలవద్ద పటిష్టబందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని రామాలయం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా భక్తుల రద్దీని దృష్టిలోపెట్టుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతోపాటు ఆలయం లోపల, చుట్టుపక్కల భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బందో బస్తు చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని ఆలయాలవద్ద వేకువజాము నుంచే భద్రతాచర్యలు చేపట్టామని పేర్కొన్నారు. సీతారాముల కల్యాణం, శోభాయాత్రల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం లేకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

నంద్యాల క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, నేరచరిత్ర గలవారు, చెడునడత కలిగిన వ్యక్తులకు ఆదివారం సకౌన్సెలింగ్ ఇచ్చినట్లు పోలీస్ అధికారులు తెలి పారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా పోలీసుల సూచనలను బేఖాతర్ చేస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీస్ అధికారులు హెచ్చరించారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


యాళ్లూరు గ్రామంలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పాణ్యం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాణ్యంలో ఆ పార్టీ మండల నాయకుడు మద్దిలేటి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు మురళీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ నాయకులు, జనసేన నాయకుడు రాము పాల్గొన్నారు.

వెలుగోడు: బీజేపీ ఆవిర్భావ దినోత్సావాన్ని మండలంలోని గుంతకందాల గ్రామంలో ఆ పార్టీ నాయకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్లుడు రాజశేఖరరెడ్డి జెండాను ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచారు. ప్రతాప్ ఆచారి, సుదాకర్, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మధు తదితరుల పాల్గొన్నారు.

గోస్పాడు: దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే సుస్థిర పాలన జరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మధుగోపాల్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం యాళ్లూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. నాయకులు బెక్కెం నాగేశ్వరరెడ్డి, రామచంద్రరెడ్డి పాల్గొన్నారు.

సున్నిపెంట: సున్నిపెంటలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు చదువు శ్రీను ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో జెండా ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వర్లు, బోయ మల్లికార్జున, రామకృష్ణ, నల్లబోతుల మల్లికార్జున, చంద్రకళ, రఫీ, మంజులమ్మ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోటీలు

బనగానపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుల గ్రామంలో శ్రీ రామనవమి సందర్భంగా సోమవారం నుంచి ఎడ్ల ప్రదర్శన, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు ఆదివారం తెలిపారు. మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు, బీసీ రాజారెడ్డి పోటీలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి : సీఐ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రదతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంత్రి నాదెండ్లను కలిసిన ఇరిగెల



మంత్రితో ఇరిగెల రాంపుల్లారెడ్డి

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ జనసేన పార్టీ నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి పుట్టిన రోజును పురస్కరించుకొని విజయవాడలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ రాజకీయ పరిస్థితుల గురించి వివరించినట్లు ఇరిగెల తెలిపారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న డ్రైవర్లు

ప్యాపిలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన డ్రైవర్ కుటుంబానికి డ్రైవర్లు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. పట్టణానికి చెందిన డ్రైవర్ చిన్నబొలికొండ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. విషయం తెలుసుకున్న డ్రైవర్లు రూ.68వేలు సేకరించి మృతుడి భార్య కల్పనకు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న గౌతమ్ కుమార్

డోన్ రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపకుంట గ్రామంలో వెంకట్రామిరెడ్డి మృతి చెందడంతో టీడీపీ యువ నాయకుడు గౌతమ్ కుమార్ రెడ్డి బాదిత కుటుంబాన్ని పరామర్శించారు. భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న డోన్ కన్వీనర్ సందు వెంకటరమణ

బేతంచెర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఆదివారం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు గుండా అశ్వర్థ నారాయణ, ముఖ్యఅతిథి డోన్ అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకటరమణ, డోన్ మండల అధ్యక్షుడు అడ్వకేట్ రవికుమార్ జెండా ఆవిష్కరించారు.

డోన్ రూరల్: మండలంలోని చింతలపేట గ్రామంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహంచారు. పార్టీ మండల అధ్యక్షుడు బొంకూరి రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరైయారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

డోన్ టౌన్: పట్టణంలోని పాత బస్టాండులో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బద్రిసుధాకర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ అబివృద్ధి దిశగా వెళ్తుందన్నారు. 1980 ఏప్రిల్ 6న వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. బొగ్గరపు నటరాజు, ఒంటెద్దుబండి కిరణ్, సందు రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఆలా శివప్రకాష్, ఉషాలక్ష్మి, ప్యాపిలి మండల అధ్యక్షులు ఓబయ్య, అరబోలు నాగరాజు, శివ, శేఖర్, నాగరాజు, విజయ్ ప్రసాద్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

వైభవంగా శ్రీరామనవమి

- డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె నియోజకవర్గాల్లో కల్యాణం
- బనగానపల్లెలో పాల్గొన్న మంత్రి బీసీ, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



కల్యాణం నిర్వహిస్తున్న మంత్రి బీసీ దంపతులు



ఆళ్లగడ్డలో కల్యాణోత్సవం



బేతంచెర్ల మండలంలో..

బనగానపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో శ్రీరామనవమి పురస్కరిం చుకొని సీతారాముల కల్యాణం నిర్వహించారు. రోడ్లు భవనాల శాటమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు, కుమారుడు బీసీ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళ్యాణ వేదికను భారీగా ఏర్పాటు చేసి 2 వేలకు మంది భక్కుతలు తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం అర్చకులు ఆనంద ప్రసాద్ ఆధ్వర్యంలో సీతారాముల వారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన పట్టు వస్త్రాలతో సీతారాముల విగ్రహాన్ని అలంకరించారు. బీసీ దంపతులు, కుటుంబ సభ్యులు ఇంటి వద్దనుంచి పట్టువస్త్రాలు, చీరె సారె తలంబ్రాలు మేళతాళాలతో ఆంజనేయస్వామి వద్దకు తీసుకువచ్చారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన కల్యాణం నిర్ణీత ముహూర్తంలో పూర్తి చేశారు. కళ్యాణోత్సవంలో రాములవారి తరుపున మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, సీతమ్మ తరుపున మంత్రి కుమార్తె బీసీ మనోహరమ్మ, రమణారెడ్డి, దంపతులు పెళ్లిపీటలపై కూర్చొని జరిపించారు. మంత్రి దంపతులతో పాటు కలెక్టర్, ఎస్పీ ముత్యాలను సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు బందోబస్తును నిర్వహించారు. టీడీపీ నాయకులు టంగుటూరు శ్రీనయ్య, కూరగా యలశేఖర్, ఉపసర్పంచ్ బురానుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని బోయపేటలోని సీతారాముల ఆలయంలోను, నాయిబ్రాహ్మణ కాలనీలోను శ్రీరాముల ఆలయంలోను, అలాగే పట్టణంలోని బుడగజంగాల కాలనీలోను, సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు.

ప్యాపిలి: మండలంలోని ప్యాపిలి, కలచట్ల, ఏనుగమర్రి, చంద్రపల్లి, ఏనుగమర్రి, జలదుర్గం, మెట్టుపల్లి గ్రామాల్లో ఆదివారం సీతారాముల కలాణం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

డోన్ రూరల్ : పట్టణ సమీపంలోని షిరిడీ సాయి బాబా ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిరర్వహించారు. టీడీపీ యువ నాయకుడు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీషిరిడీ సాయిబాబా కమిటి సభ్యులు సీఎం శ్రీనివాసులు, ఆలా మల్లికార్జున, భక్తులు తదితరులు కళ్యాణోత్సవ పూజల్లో పాల్గొన్నారు. అదేవిధంగా రామచంద్రమాలిక్‌బాబా ఆలయంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. కమలాపురం, గోసానిపల్లె, సోంపురం, బట్వారిపల్లె, చిన్నమల్కాపురం గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల, వెంకటాపురం తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

కొలిమిగుండ్ల: మండలంలోని గ్రామాల్లో సీతారాముల కళ్యాణం కమనీయంగా సాగింది. వేద పండుతుల మంత్రోచ్చారణల మధ్య సాంప్రదాయ పద్ధతిలో సాగిన కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు తరలి వచ్చారు. మీర్జాపురం, కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, ఇటిక్యాల, బెలుం, పెట్నికోట తదితర గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో డా.మల్లికార్జునరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, పోరెడ్డి రామచంద్రారెడ్డి భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా కొలిమిగుండ్ల కొండపై వెలసిన లక్ష్మీనరసింహ స్వామి గ్రామోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పండితులు ఆలూరు నరసింహప్రసాద్, రాఘవేంద్ర ప్రసాద్ కుటుంబ సభ్యులు ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి పూజలు నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఉయ్యాలవాడ, హరివరం, సర్వాయిపల్లె, మాయలూరు తదితర గ్రామాల్లో కల్యాణం జరిపించారు. ఉయ్యాలవాడలో టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి శేఖర్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు, భాస్కరశర్మ, కీర్తిలక్ష్మణస్వామి, రమణయ్య వేదమంత్రాలు, వాయిద్యాల మధ్య కల్యాణం జరిపించారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని కోదండ రామాలయం, అమ్మవారి శాల, అభయాంజనేయ ఆలయాల్లో శ్రీరామనవమి నిర్వహించారు. అర్చకులు కల్యాణం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

చాగలమర్రి: మండలంలోని మూడురాళ్లపల్లె, చిన్నవంగలి, చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ, మల్లెంవీధిలో, బసవన్నకట్ట వీధిలోగల రామాలయాల్లో కల్యాణం నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం, దొర్నిపాడు, కొండాపురం, రామచంద్రాపురం తదితర గ్రామాలో కల్యాణం జరిగింది. భక్తులు తరలివచ్చారు. స్వామి అనంతరం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేట రామాలయం, ఇందిరానగర్ ఆంజనేయస్వామి ఆలయం, పాతబుగ్గ రామేశ్వరాల యాలతో పాటు పలు ఆలయాల్లో ఆదివారం వేడుకలు నిర్వహించారు. అర్చకులు, వేద పండి తులు మంత్రోచ్చారణల మధ్య కల్యాణం నిర్వహిం చారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు పట్టువస్త్రాలు సమర్పించారు.

బేతంచెర్ల: పట్టణంలోని నంద్యాల రహదారిలోని పలక చింతమాను ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం చేశారు. పట్టణంలోని గౌరి పేట ఆంజనేయస్వామి, గాడుబావి ఆంజనేయ స్వామి ఆలయంలో వేడుకలు జరిగాయి.

రుద్రవరం: మండలంలో సీతారాముల కల్యాణం కన్నులపండువగా రమణీయంగా సాగింది. మండలంలోని కోటకొండ, దక్షిణకొట్టాలు, భజనపల్లె, రుద్రవరం, బెస్తకాలనీ, మందలూరు, ముత్తలూరు, చిన్న కంబలూరు, చిత్తరేణిపల్లె, ముకుందాపురం, కొత్తూరు, కొత్తపల్లె గ్రామాల్లో కల్యాణం వైభవంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.



రుద్రవరం మండలంలో కల్యాణం



బనగానపల్లెలో కల్యాణానికి వస్తున్న కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



చాగలమర్రిలో కల్యాణం చేస్తున్న అర్చకుడు



కొలిమిగుండ్లలో పాల్గొన్న భక్తులు



డోన్ షిరిడీ సాయిబాబా ఆలయంలో ..

చౌడేశ్వరి ఆలయానికి విరాళం

బనగానపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరి ఆలయానికి అనంతపురం జిల్లా ప్యాపిలికి చెందిన తమ్మినేని రాజశేఖర్ నాయుడు, సుగుణ దంపతులు ఆదివారం రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ ఛైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డికి



విరాళం అందిస్తున్న దాతలు

'కరీముల్లా మరింత పేరు తెచ్చుకోవాలి'



బీసీ రాజారెడ్డిని సన్మానిస్తున్న కరీముల్లా

బనగానపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ సింగర్ కరీముల్లా మరింత పేరు తెచ్చుకోవాలని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలోని బీసీ రాజారెడ్డిని కార్యాలయంలో కరీముల్లా బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి సినిమాలో జైబాలయ్య పాటతో మన్ననలు పొందారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

డోన్ రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీలం భాస్కర్ నాయుడును ఆదివారం సన్మానించారు. చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రామనాయుడు, బాలకృష్ణ సంఘం ఉపాధ్యక్షుడు బోయ మాధవస్వామి పూలమాలలు, శాలువలతో సత్కరించారు. టెంకాయల కేశవయ్య, విజయమహన్ నాయుడు, క్రిష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చాగలమర్రి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని మార్కెట్ రహదారిలో టీడీపీ, భూమా అభిమానులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తి తర్చేందుకు ఎమ్మెల్యే భూమా అల్రప్రియ ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు. మైనార్టీ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి ట్రీఎస్‌టీయూసీ కార్యదర్శి గుత్తి నరసింహులు, బీసీ సంఘ నాయకులు లక్ష్మీనారాయణ, రామతీర్థం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వన్యప్రాణి మాంసం ఖననం

రుద్రవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఫారెస్టు డిపోలో ఆదివారం పట్టుబడిన వన్యప్రాణి మాంసాన్ని రేంజర్ శ్రీపతినాయుడు ఆధ్వర్యంలో పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ పోస్టుమార్టం నిర్వహించారు. కొద్ది మాంసాన్ని ల్యాబ్‌కు పంపడానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం వన్యప్రాణి మాంసాన్ని డిపో ఆవరణలో ఖననం చేశారు. డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్ రామక్రిష్ణ, పాల్గొన్నారు.



ఖననం చేస్తున్న సిబ్బంది

కలశ స్థాపనకు సర్వం సిద్ధం

రుద్రవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలోని ప్రతాపరుద్ర అంజనేయస్వామి ఆలయ ధ్వజ కలశ శిఖర స్థాపనకు సర్వం సిద్ధం చేసినట్లు ఆదివారం గ్రామపెద్దలు అయ్యప్పస్వామి కమిటీ సభ్యులు తెలిపారు. హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

తాళిబొట్టు, వెండి కిరీటం వితరణ

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన చిట్టెపు సంజీవరెడ్డి దంపతులు బంగారు తాళిబొట్టును, హైదరాబాదుకు చెందిన భక్తుడు వెండి కిరీటాన్ని సీతమ్మవారికి ఇచ్చినట్లు అర్చకుడు కీర్తిలక్ష్మణస్వామి తెలిపారు.

పంచలోహ విగ్రహాల వితరణ



విగ్రహాలను అందజేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందిన్నె గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ సీతారామ విగ్రహాలను అందజేశారు. గ్రామ ప్రజలు మూడు నెలల క్రితం ఇందిరమ్మను కోడంతో అమె తయారు చేయించి ఇవ్వడంతో గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సాయి పల్లకీ ఉత్సవం

చాగలమర్రి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని సాయినాధ మందిరంలో ఆదివారం సాయి పల్లకితో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో వీధుల్లో పల్లకి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, అబిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు లక్ష్మీనారాయణ, వినోద్‌కుమార్, సుబ్బారావు, నాగభూషణం, వినయ్‌కుమార్, రఘురామ్, సుబ్బారావు, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవింద్రారెడ్డి, సాయి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతో వైసీపీకి గుబులు

- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి
- అన్నవరం గ్రామంలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజచేసిన మంత్రి



అన్నవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

అవుకు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి వైసీపీలో గుబులు రేగుతుందని ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అవుకు మండలం అన్నవరం గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయనకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ అవుకు అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, క్కాటిడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, మాదిరెడ్డి కాశిరెడ్డి ఘనస్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పల్లెకు మెరుగైన రహదారులే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని తెలిపారు.

చెన్నంపల్లె, చిన్నకొట్టాల, నిచ్చెనమెట్ల, అన్నవరం, వేములపాడు, జంబులదిన్నె గ్రామాలను అనుసంధానిస్తూ రూ. 18 కోట్లతో 12.60 కి.మీ రహదారిని నిర్మిస్తున్నామన్నారు. అన్నవరం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే విధ్వంసంతో పాలన ప్రారంభించి, ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడమే కాక రాష్ట్రానికి రాజధాని లేకుండాచేసిన ఘనత వైసీపీకే దక్కిందని విమర్శించారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయి వైసీపీ 11 సీట్లకే పరిమితమైందన్నారు. అభివృద్ధి సంక్షేమంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. నాయకులు మాదిరెడ్డి బాలనాగిరెడ్డి, ఈశ్వరరెడ్డి, దామోదరరెడ్డి, మొట్ల రామిరెడ్డి, వెంకటరమణనాయక్ పాల్గొన్నారు.